క్లుప్తంగా

ఘనంగా బ్రహ్మంగారి జయంత్యుత్సవాలు



రేగోడ్ పూజల్లో పాల్గొన్న భక్తులు

రేగోడ్(మెదక్): మండల కేంద్రమైన రేగోడ్‌లో శ్రీపోతులూరి వీరబ్రహ్మంగారి మఠంలో 416వ జయంత్యుత్సవాలు బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి డోలారోహణ జరిపించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు పూర్ణచందర్, ప్రధాన కార్యదర్శి అవుసలి రమేశ్, కోశాధికారి గొల్ల వీరేశం మాట్లాడుతూ తెలంగాణలోనే ఏకైక బ్రహ్మంగారి మఠంగా ప్రసిద్ధిగాంచిన ఈ మఠానికి దాతలు తమ వంతు సహకారం అందించాన్నారు.

సర్వీస్ పుస్తకాల పంపిణీ



సర్వీస్ పుస్తకాలతో ఉపాధ్యాయులు

అల్లాదుర్గం(మెదక్): మండలంలో నూతనంగా విధులలో చేరిన ఉపాధ్యాయులకు పీఆర్‌టీయూశాఖ మండలశాఖ ఆధ్వర్యంలో బుధవారం సర్వీస్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఎంఈఓ ధనుంజయ్య బుధవారం ఐడీలను కూడా అందజేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు జనార్దన్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై యూనియన్ నిరంతరం పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు రంజ్యానాయక్, సత్యనారాయణ, కిష్టయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అప్రమత్తం



చిన్నారులతో డాక్టర్ సుబ్రహ్మణ్యం తదితరులు

శివ్వంపేట(నర్సాపూర్): ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని బాలనగర్ లయన్స్ క్లబ్ ఎల్టీ డాక్టర్ సుబ్రహ్మణ్యం సూచించారు. మధుమేహం దినోత్సవం సందర్భంగా బుధవారం మండల పరిధి మగ్దుంపూర్‌లో ఆరోగ్యంపై అవగాహన సదస్సు, ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పలువురికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. 30యేళ్లపై పడగానే బీపీ, షుగర్ వస్తున్నాయని, ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే వాటికి దూరంగా ఉండొచ్చని చెప్పారు. గురువారం బాలల దినోత్సవం సందర్భంగా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్టేషనరీ, బిస్కెట్లు, చాక్లెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన్ గ్రామీణ అభివృద్ధి సంస్థ చైర్మన్ లక్ష్మీ కాంతరావు, మాజీ సర్పంచ్ అశోక్, హెచ్‌ఎం మంజుల తదితరులు ఉన్నారు.

నాణ్యమైన విద్యనందించండి



మాట్లాడుతున్న ఎంఈఓ ధనుంజయ్య

అల్లాదుర్గం(మెదక్): ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు కృషి చేయాలని ఎంఈఓ ధనుంజయ్య పిలుపునిచ్చారు. స్థానిక బాలుర పాఠశాలలో బుధవారం హెచ్‌ఎంల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



కమ్మరి శేఖర్

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని నస్కల్ గ్రామానికి చెందిన ఒక వ్యక్తి విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. గ్రామానికి చెందిన కమ్మరి శేఖర్ అలియాస్ శంకర్ (48) గ్రామంలో విద్యుత్ పనిపై కూలికి వెళ్తుండేవాడు. రెండు నెలల క్రితం స్తంభంపై ఎక్కి విద్యుత్ పనులు చేస్తుండగా.. షాక్ తగిలి కింద పడిపోవడంతో వెన్నుపూస ఇరిగి తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్ గాంధీ ఆస్పత్రిలో పది రోజులపాటు చికిత్స చేయించుకొని.. అనంతరం ఇంటికి తీసుకొచ్చారు. స్థానికంగా చికిత్స పొందుతున్న శేఖర్.. బుధవారం ఉదయం మృతి చెందాడు.

శిథిలమైన పశు వైద్యశాల భవనం

ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి

- ఆందోళన చెందుతున్న రైతులు, ఉద్యోగులు

రామాయంపేట(మెదక్): మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ప్రాంతీయ పశు వైద్యశాల భవనం పూర్తిగా శిథిలమైంది. ఏ క్షణాన కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. భవనం స్లాబ్ కిందిభాగం నుంచి తరచూ సిమెంట్ పెచ్చులు ఊడిపడుతున్నాయి. దీంతో ఇందులో పనిచేసే ఉద్యోగులు, ఆస్పత్రికి వస్తున్న రైతులు ఆందోళన చెందుతున్నారు. రామాయంపేటలో 65 ఏళ్ల క్రితం పశు వైద్యశాల భవనాన్ని నిర్మించారు. ప్రస్తుతం ఈ భవనం పూర్తిగా శిథిలమైంది. ఈభవనంలో సహాయ సంచాలకుల కార్యాలయంతో పాటు ఆస్పత్రి, గోదాం కొనసాగుతున్నాయి. కాగా పూర్తిగా శిథిలమైన ఈభవనాన్ని వినియోగించొద్దని ఇంజనీరింగ్ శాఖ అధికారులు పదిహేనేళ్ల క్రితమే ఉత్తర్వులు జారీ చేసినా.. ఇతర సదుపాయం లేకపోవడంతో ఇందులోనే కొనసాగిస్తున్నారు. కొత్త భవనం నిర్మాణం విషయమై ఆశాఖ ఉన్నతాధికారులు నాలుగైదేళ్లుగా ప్రయత్నిస్తుండగా, నిధులు మంజూరు కావడంలేదు. దీనితో విధిలేని పరిస్థితుల్లో ఉద్యోగులు ఈ భవనంలోనే భయం భయంగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ భవనానికి 2004లో తాత్కాలికంగా మరమ్మతులు చేయించినా ఫలితంలేదు. కాగా కార్యాలయంలో తాము విధి నిర్వాహణలో ఉన్న సమయంలోనే పలుమార్లు స్లాబ్ పైభాగం నుంచి సిమెంట్ పెచ్చులూడి పడ్డాయని ఉద్యోగులు భయాందోళన వ్యక్తం చేశారు. శిథిలమైన ఈ భవనం స్థానంలోనే కొత్త భవనం నిర్మాణం కోసం గతంలో ఎంపీపీ సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేసినా ఫలితం లేదు.

భయం భయంగా...

పూర్తిగా శిథిలమై ఎపుడు కూలుతుందో తెలియని పరిస్థితిలో పశువులకు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి వస్తున్న రైతులు లోపలికి వెళ్లాలంటేనే భయపడుతున్నారు. తాము లోపలికి వస్తే ఎక్కడ తమపై సిమెంట్ పెచ్చులూడి పడుతాయోనని వారు ఆందోళన చెందుతున్నారు. కాగా ఈ ఆస్పత్రి పరిధిలో రామాయంపేట, దామరచెరువు, కోమటిపల్లి గ్రామాలతో పాటు రెండు గిరిజన తండాలు న్నాయి. ప్రతీరోజు పశువులకు చికిత్స నిమిత్తం పదిహేను నుంచి 20 మంది వరకు రైతులు తమ పశువులను ఆస్పత్రికి తెస్తున్నారు.



పశువుల ఆస్పత్రి గోడలకు పగుళ్లు వ్యాపించిన దృశ్యం



భవనం స్లాబ్ కింది భాగంలో పెచ్చులూడి తేలిన ఇనుప చువ్వలు

ప్రతిపాదనలు పంపించాం



పశువైద్యశాల భవనం పూర్తిగా శిథిలమైంది. దీంతో దాని స్థానంలో కొత్త భవనం నిర్మాణానికి ఇప్పటికే ఉన్నతాధికారులు ప్రతిపాదనలు పంపించాం. ఈ భవనం పూర్తిగా శిథిలమవడంతో లోపల కూర్చోవాలంటేనే భయాందోళన చెందుతున్నాం. రైతులు కూడా లోపలికి రావాలంటేనే భయపడుతున్నారు.

– డాక్టర్ తిరుపతి, ఏడీ, రామాయంపేట

నీటి కోసం ఖాళీ బిందెలతో నిరసన

నిజాంపేట(మెదక్): కొన్ని రోజులుగా తాగునీటి సరఫరా లేక ఇబ్బందులకు గురవుతున్నట్లు నస్కల్ గ్రామంలోని మైసమ్మ కాలనీ వాసులు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీటి కోసం వేరే కాలనీకి వెళ్లి నీరు తెచ్చుకుంటున్నామన్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులు స్పందించి నీటి సమస్య పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నర్సింహులు, దేవరాజు, పద్మ తదితరులు పాల్గొన్నారు.



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న కాలనీవాసులు

సామూహిక సత్యనారాయణ వ్రతాలు



పూజలు చేస్తున్న భక్తులు

కొల్చారం(నర్సాపూర్): సంగాయిపేటలోని వెంకటాద్రిపై వెలిసిన వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో బుధవారం సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. అంతకుముందు అర్తం శశిరేఖ శంకర్ దంపతుల ఆర్థిక సహకారంతో నూతన నిర్మిత మండపాన్ని వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య ప్రారంభించారు. అనంతరం సామూహిక సత్యనారాయణ వ్రతాల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. పూజా కార్యక్రమం అనంతరం అన్న ప్రసాద వితరణ నిర్వహించారు.

పరిశ్రమ కాలుష్యాన్ని నియంత్రించండి

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని ఖాజాపూర్ ఐరేని స్టీల్ పరిశ్రమ నుంచి వెదజల్లే కాలుష్యాన్ని నియంత్రించాలని గ్రామస్తులు కోరారు. పరిశ్రమ సమీపంలోని పంట పొలాల్లో నల్లని దూలి పడుతండడంతో పంట దిడుబడి తగ్గుతుందని పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బుధవారం పీసీబీ ఏఈ అజయ్ పరిశ్రమ పరిసరాలను పరిశీలించారు. ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు.



రైతులతో మాట్లాడుతున్న పీసీబీ ఏఈ అజయ్

స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి

చిన్నశంకరంపేట(మెదక్): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు బీజేపీ కార్యకర్తలు సన్నద్ధం కావాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎల్ఎన్ రెడ్డి కోరారు. బుధవారం చిన్నశంకరంపేటలో నిర్వహించిన బీజేపీ క్రియాశీల కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక ఎన్నికల్లో బీజేపీ సత్తాచాటాలని పిలుపునిచ్చారు. బీజేపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు నందారెడ్డి, రాగి రాములు, బీజేపీ మండల అధ్యక్షుడు పోగుల రాజు, దశరథం, నరేందర్‌రెడ్డి, మేడి స్వామి, మహిళా మోర్చా అధ్యక్షురాలు మంజుల, స్వామి, పట్టణ అధ్యక్షుడు ఆకుల రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

భూసేకరణలో లోపాలుంటే తెలపండి



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్

మనోహరబాద్(తూప్రాన్): ప్రభుత్వం పరిశ్రమల కోసం జరుపుతున్న భూసేకరణలో లోపాలు ఉంటే తెలియజేయాలని తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పోతారంలో ప్రభుత్వం టీఎస్ఐసీసీ కోసం సేకరిస్తున్న భూముల విషయమై రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోతారం శివారులో 60, 112 సర్వే నంబర్లలో 164 ఎకరాల భూమిని పరిశ్రమల కోసం సేకరిస్తున్నట్లు తెలిపారు. ఈ భూములకు సంబంధించి సమస్యలను తెలియజేస్తే వాటిని పరిష్కరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ దీక్షితులు, రైతులు పాల్గొన్నారు.

ఇటుకతో దాడి.. వ్యక్తికి గాయాలు

అల్లాదుర్గం(మెదక్): ఇటుకతో ఓ వ్యక్తిపై దాడి చేయడంతో తల పగిలి గాయాలయ్యాయి. ఈ సంఘటన అల్లాదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని చిల్వెర ఐబీ చౌరస్తాలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి కథనం ప్రకారం.. గొల్లకుంట తండాకు చెందిన రాత్ల లక్ష్మీబాయ్, కిషన్ భార్యాభర్తలు కలిసి చిల్వెర ఐబీ చౌరస్తాలోని నరేందర్ టీ షాపులో చాయ్ తగడానికి వెళ్లారు. గాండ్లబాయ్ తండాకు చెందిన దేవసోత్ పాండు అక్కడికి వచ్చాడు. లక్ష్మీబాయ్, కిషన్‌తో గొడవపడ్డారు. కిషన్ తలపై పాండు ఇటుకతో దాడి చేయడంతో గాయాలైనట్లు ఎస్ఐ చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

24 బ్యాటరీలు చోరీ



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

శివ్వంపేట(నర్సాపూర్): ఎయిర్‌టెల్ టవర్ రూమ్ నుంచి గుర్తుతెలియని వ్యక్తులు 24 బ్యాటరీలు చోరీ చేసిన ఘటన మండల పరిధి చిన్నగొట్టిముక్ల గ్రామంలో మంగళవారం అర్ధ రాత్రి చోటుచేసుకుంది. గ్రామంలోని ఎయిర్‌టెల్ టవర్ సిగ్నల్ ఆగిపోవడంతో బుధవారం తెల్లవారుజామున సిబ్బంది టవర్ వద్దకు వచ్చి చూస్తే టవర్ రూం తాళాలు పగలగొట్టి ఉండడం గమనించారు. అందులోని 24 బ్యాటరీలు దొంగలించినట్లు టవర్ సూపర్ వైజర్ మురళీకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు, క్లూస్ టీమ్‌లో అక్కడి చేరి వివరాలు సేకరించారు.

ఉపాధ్యాయులపై ఒత్తిడి తేవద్దు

చిన్నశంకరంపేట(మెదక్): సమగ్ర సర్వే విషయంలో ఉపాధ్యాయులకు స్వేచ్ఛ ఇవ్వాలంటూ ఎంపీడీఓ దామోదర్‌కు ఉపాధ్యాయ సంఘాల నాయకులు వినతి పత్రం అందించారు. సర్వేలో రోజుకు ఇన్ని కుటుంబాలను సర్వే చేయాలనే టార్గెట్ పెట్టవద్దన్నారు. రోజువారి టార్గెట్‌తో ఒత్తిడి పెరుగుతుందన్నారు. సర్వేను గడువులోగా పూర్తిచేసే బాధ్యత ఉపాధ్యాయులదేన్నారు. వినతి పత్రం అందించి వారిలో సంఘాల నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, హరిబాబు, సత్యనారాయణ, చారీ తదితరులు ఉన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



మాట్లాడుతున్న ఏడీఏ రాజ్‌నారాయణ

చేగుంట(తూప్రాన్): యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధ్యమని సహాయ వ్యవసాయ సంచాలకులు రాజ్‌నారాయణ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన చేగుంటలోని రైతు వేదికలో సెహగల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేగుంట, నార్సింగి, చిన్నశంకరంపేట మండలాల్లో ఎంపిక చేసిన 30 మంది రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పంటల్లో యాజమాన్య పద్ధతులు, చీడపీడల నివారణ చర్యలను పాటించే వివరాలను తెలియజేశారు. రైతులకు ఫౌండేషన్ అందిస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిలుక నాగరాజు, రమణ, మల్లేశం, నాగరాజు, సెహగల్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కొనుగోళ్లు లేక వెలవెల

మాచాపూర్ కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాశులు



చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని మాచాపూర్‌లో పక్షం రోజుల క్రితం ఐకేపీ ఆధ్వర్యంలో అట్టహాసంగా ప్రారంభించిన ధాన్యం కొనుగోలు కేంద్రం వెలవెలబోతోంది. తమకు అందుబాటులో కొనుగోలు కేంద్రం ప్రారంభమైందని రైతులు సంతోషించారు. రైతులు తమ ధాన్యాన్ని కేంద్రానికి తరలించారు. అయితే కొనుగోళ్లకు కొర్రీలు పెట్టడంతో దిక్కుతోచని రైతులు ప్రైవేటు వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ఒక్క గింజను కూడా కొనుగోలు చేయకపోవడంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం ధాన్యం కుప్పలు లేక వెలవెలబోతుంది.

‘అధిక సాంద్రత’తో అధిక దిగుబడి

శాస్త్రవేత్త రవికుమార్

కొండపాక(గజ్వేల్): అధిక సాంద్రత పత్తిసాగు ఎంతో లాభదాయకమని మెదక్ జిల్లా తునికి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు రవికుమార్, ఉదయ్‌కుమార్ సూచించారు. కుకునూరుపల్లిలో పలువురు రైతులు సాగుచేసిన పత్తి పంటను బుధవారం వారు పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ అధిక సాంద్రత పత్తి సాగు వల్ల మొక్కలు ఏపుగా పెరుగుతాయని, రెండు నెలల ముందుగానే పంట చేతికందుతుందన్నారు. చమత్కార్ మందును రెండు మార్లు స్ప్రే చేయడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని చెప్పారు. ఎర్ర, మధ్యస్థ నేలల్లో సాగు చేస్తే యాసంగిలో సైతం రెండో పంటను సాగు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి గోవిందరాజు, శాస్త్రవేత్త ప్రతాప్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.



పత్తి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

సంక్షిప్త వార్తలు

◆ **రెండో రోజు కొనసాగిన వైద్య శిబిరం**

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి నవాబుపేటలో రెండోరోజైన బుధవారం కూడా మహిళలకు క్యాన్సర్‌పై అవగాహన, ఉచిత వైద్య శిబిరం కొనసాగింది. ఫ్లెమింగ్ లేబొరేటరీస్ సౌజన్యంతో బసవతారకం ఇండో– అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి, రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ సహకారంతోసీ కార్యక్రమం చేపట్టారు. క్యాన్సర్ పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఫ్లెమింగ్ లేబొరేటరీస్ ఎండీ ప్రకాశ్ సూచించారు. కార్యక్రమంలో ఫ్లెమింగ్ పరిశ్రమ ప్రతినిధులు మనోహర్, శ్రీనివాస్‌రావు, రాజేంద్ర, వైద్యులు నాగప్రశాంతి, సులోచనరాణి, ప్రదీప్‌రెడ్డి పాల్గొన్నారు.

◆ **సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత**

కొల్చారం(నర్సపూర్): మండలంలోని పోతన శెట్టిపల్లి గ్రామానికి చెందిన గిరి గల్ల మంజులకు అవసరమైన చికిత్స కోసం ఎమ్మెల్యే సునీతారెడ్డి రూ.18వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో సిద్దిరాములు,గౌరీ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

◆ **పేదింటి పెళ్లిళ్లకు ఆర్థిక సాయం**

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రమైన శివ్వంపేటకు చెందిన పలువురు పేదింటి కుటుంబాల పెళ్లిళ్లకు కాంగ్రెస్ నేత నవీన్‌గుప్తా బుధవారం ఆర్థికసాయం అందజేశారు. గ్రామానికి చెందిన నారాయణగారి అర్చన, మియ్యాడి యాదగిరి పెళ్లిళ్ల కోసం ఒక్కో కుటుంబానికి రూ.10 వేలు చొప్పున ఆర్థికసాయం, నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గణేష్, ప్రభులింగంగౌడ్, శ్రీనివాస్, ఆంజనేయులు,మల్లేష్ యాదవ్, షేక్‌అలీ, తదితరులు ఉన్నారు.

◆ **నూతన తహసీల్దార్ కార్యాలయం సందర్శన**

నిజాంపేట(మెదక్): నిజాంపేట మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం ఆర్డీఓ రమాదేవి, డీపీఓ యాదయ్య సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత కార్యాలయం శిథిలా వ్యవస్థలో ఉన్నందున నూతనంగా నిర్మించిన కార్యాలయాన్ని పరిశీలించామన్నారు. కార్యాలయానికి అన్ని సదుపాయాలు ఉన్నాయని తెలిపారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు.

◆ **పిచ్చికుక్క దాడిలో పలువురికి గాయాలు**

చేగుంట(తూప్రాన్): ఓ పిచ్చికుక్క దాడి చేసి పలువురిని గాయపరిచింది. ఈ సంఘటన మండలంలోని గొల్లపల్లి గ్రామంలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. తండా వైపు నుంచి గ్రామంలోకి వచ్చిన పిచ్చికుక్క ధాన్యం కుప్పల వద్ద ఉన్న చందిబాబును కరిచి గాయపరిచింది. అనంతరం ప్రవంతి, కృష్ణవేణితో పాటు మరో చిన్నారిని కరిచింది. గాయపడిన వారిని అంబులెన్స్‌లో గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సమగ్ర కుటుంబ సర్వేపై సమీక్ష

చేర్యాల(సిద్దిపేట): మండలంలో కొనసాగుతున్న సర్వేపై బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి శ్రీరాంరెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మండల అధికారులు, సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లకు పలు సూచనలు చేశారు. తప్పనిసరిగా ఐడీ కార్డు ధరించాలని, మీడియాతో మాటాడొద్దని, ప్రముఖ రాజకీయ నాయకుల కుటుంబాలను కూడా సర్వే చేయాలని చెప్పారు. కుటుంబాల యజమానులకు ముందుగా సమాచారమివ్వాలని, కులానికి సంబంధించిన వివరాలను నింపాలని చెప్పారు. సమావేశంలో మండల ప్రత్యేక అధికారి నాగరాజు, తహసీల్దార్ సమీర్ అహ్మద్ ఖాన్, ఎంపీడీఓ మహబూబ్ అలీ, మున్సిపల్ కమిషనర్ నాగేందర్, ఎంఈఓ కిష్టయ్య, మండల అధికారులు పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న శ్రీరాంరెడ్డి

లింగాకర్షక బుట్టల పంపిణీ



అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త రమేష్

జహీరాబాద్: రైతులకు డీడీఎస్–కేవీకేల ఆధ్వర్యంలో ఉచితంగా లింగాకర్షక బుట్టలు, వేపనూనె పంపిణీ చేశారు. బుధవారం మొగుడంపల్లి మండలం ఉప్పర్‌పల్లి తండా, న్యాల్‌కల్ మండలం మామిడ్గి, శంశల్లాపూర్, ఝరాసంగం మండలం పొట్‌పల్లి, కంగ్టి మండలం నాగూర్(కె), కిసాన్‌నాయక్ తండా రైతులకు అందజేశారు. శాస్త్రవేత్త రమేష్ మాట్లాడుతూ.. రైతులకు ఇచ్చిన కంది రకం(టీడీఆర్‌జీ–59) ప్యూజేరియం ఎండు తెగుళ్లను తట్టుకుంటుందన్నారు. మారుకా మచ్చల పురుగు, శనగపచ్చ పురుగు నివారణకు లీటరు నీటిలో 5.మి.లీ వేపనూనె పిచికారీ చేయాలని సూచించారు. ఉధృతి ఎక్కువగా ఉంటే దశపర్ణి కషాయం, 5 లీటర్లు ఎకరాకు సరిపోయే నీటిలో పిచికారీ చేయాలన్నారు. ఎకరాకు 10 లింగాకర్షక బుట్టలు అమర్చి పురుగు ఉధృతిని నివారించవచ్చన్నారు. ఎండు తెగుళ్ల నివారించడానికి తట్టుకునే రకాలు ఆశ, హనుమ, మారుతి, మన్యంకొండ కంది రకాలను వేసుకోవాలన్నారు.